



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 23 సంచిక : 171 ది. 09-09-2024 విజయవాడ సోమవారం పేజీలు : 8 వెల : రూ. 1/-


## ఏపీలో భారీ వర్షాలు.. ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు పంపండి- సీఎం చంద్రబాబు

**అమరావతి సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం.. ఆయా జిల్లాల్లో పరిస్థితులు, నమోదైన వర్షపాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులు, తీసుకుంటున్న చర్యలు, సన్నద్ధతను కలెక్టర్లు చంద్రబాబుకు వివరించారు. జిల్లాలో నమోదైన వర్షపాతాన్ని అంచనా వేసుకుని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. ఆదివారం, సోమవారం కూడా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాల ప్రభావం కనిపిస్తోందన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు సేవలు అభినందనీయం- గవర్నర్

### రాష్ట్రంలో వరద పరిస్థితులను రాష్ట్ర గవర్నర్ కు వివరించిన సీఎం



**విజయవాడ,సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలో భారీ వర్షాలు, ముఖ్యంగా విజయవాడ నగరంలో బుడమేరు వల్ల సంభవించిన వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం రాజ్ భవన్ కు వెళ్లి రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వరద పరిస్థితులు, ప్రభుత్వం చేపట్టిన సహాయ పునరావాస చర్యలను వివరించారు. వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగమంతా రేయింబవళ్లు నిరంతరం పనిచేసి పెద్దఎత్తున సహాయ పునరావాస చర్యలు చేపట్టడం జరిగిందని సీఎం గవర్నర్ వివరించారు. వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయ, పునరావాస చర్యలను ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షించడం పట్ల గవర్నర్ అబ్దుల్ నజీర్ సీఎంను ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.



### వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా

# కదలొస్తున్న దాతలు

### ముఖ్యమంత్రిని కలిసి పలువురు విరాళాలు అందజేత

**అమరావతి సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వరద బాధితులను ఆదుకునేం దుకు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. పారిశ్రామిక వేత్తలు, డాక్టర్లు, చలన చిత్ర ప్రముఖులు, విద్యారంగ ప్రముఖులు, ప్రవాస భారతీయులు పెద్దఎత్తున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి విరాళాలు అందజేస్తున్నారు. ఆపన్న హస్తం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న దాతలకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ లో సీఎం చంద్రబాబును కలిసి ఆదివారం పెద్ద ఎత్తన విరాళాలు అందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా సాయం అందిస్తున్న దాతలకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.



### అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేస్తాం

# సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్: సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలో సభ్యులకు భూకేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. "గతంలో జర్నలిస్టులకు ఇళ్లు కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. సమస్యను పరిష్కరించాల్సిన వ్యక్తులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అలా వ్యవహరించినప్పుడే సమస్యను పరిష్కరించవచ్చు. మా ప్రభుత్వం అనేక సమస్యలకు పరిష్కారం చూపింది. వృత్తిపరమైన గౌరవం మనకు మనమే పెంచుకోవాలి". "గతంలో అసెంబ్లీ జరిగినప్పుడు జర్నలిస్టులను లోపలికి అనుమతించలేదు. మా ప్రభుత్వం వచ్చాక స్పీకర్‌కు నేనే అసెంబ్లీ లోపలికి జర్నలిస్టులను అనుమతించాలని కోరా. ఏ వర్గంలో అయినా కొందరు చేసే పని వల్లనే ఇబ్బంది కలుగుతోంది. గతంలో సచివాలయానికి వెళ్లేందుకు మాకే అనుమతి లేదు. కొంత మందికి పాస్‌లు ఇచ్చి లోపలికి రప్పించి ఇబ్బంది కలిగిస్తున్నారు. అలాంటి వారిని కట్టడి చేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపైనే ఉంది. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు, ఇళ్ల పట్టా, హెల్త్ కార్డు ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. వ్యవస్థల మీద నమ్మకం పెంచాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఇళ్ల స్థలాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలో 73 మంది నిజాన్ని చూడక ముందే కన్ను మూశారు. అర్హులైన ప్రతి జర్నలిస్ట్‌కు ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు ఇస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# గృహ నిర్మాణ 100 రోజుల లక్ష్యాల పూర్తిపై దృష్టిపెట్టండి

**– మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు సమన్వయ శాఖల అధికారులు కృషిచేయాలి. – వరద ప్రభావిత ప్రాంతాల్లో గృహ నిర్మాణ అధికారులు సిబ్బంది సేవలు భేష్. – రాష్ట్ర గృహ నిర్మాణంబీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**




**విజయవాడ,సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన వందరోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణంబీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఆదివారం మంత్రి కొలుసు పార్థసారథి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన ప్రగతిపై సమీక్షించారు. వందరోజుల ప్రణాళిక కింద నిర్దేశించిన లక్ష్యాలు, వాటి సాధనలో పురోగతిని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (గృహ నిర్మాణం) అజయ్ జైన్ వివరించారు. అదేవిధంగా మొత్తం మంజూరైన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలను ఏపీ ఎస్ హెచ్ సి ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజాబాబు వివరించగా, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన వివరాలను ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పేదలకు ఇళ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని ఈ నేపథ్యంలో అధికారులు చొరవ చూపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా దాదాపు ఏడు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని.. మిగిలిన ఇళ్లను 2025, మార్చినాటికి పూర్తి చేసేందుకు కృషిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారులకు క్షేత్రస్థాయిలో సందర్శించి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేయాలి అన్నారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఉంటే యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి పనుల్లో జాప్యం లేకుండా చేయాలన్నారు. లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంలో చేయిపట్టి నడిపించాలన్నారు. అదేవిధంగా కాలనీల్లో మౌలిక వసతులు కల్పనపై కూడా దృష్టిసారించి మంజూరు చేసిన పనుల పూర్తికి ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. రహదారుల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీరాజ్ అధికారులతోనూ, మంచినీటి సరఫరాకు సంబంధించి గ్రామీణ నీటి సరఫరా అధికారులతోనూ కలిసి పనిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జల జీవవ్ మిషన్ కింద మంజూరు చేసిన పనులను పూర్తిచేయాలని, అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో అమృత్ పథకం కింద పనులు చేపట్టేలా పురపాలక సంఘ అధికారులతోనూ సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ వాటి ప్రభావం లేని పనుల పూర్తికి కృషిచేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యల్లో భాగస్వామ్యం అవుతున్న గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందిని మంత్రి పార్థసారథి ప్రశంసించారు.

# వరద బాధితుల సహాయ సేవల్లో గుడివాడ న్యాయమూర్తులు




**గుడివాడ: సెప్టెంబర్ 6: :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ వారి ఉత్తర్వుల ప్రకారం బుడమేరుకు వరద ప్రవాహం రావటంతో నీటమునిగిన జొన్నపాడు, నందివాడ, పెద లింగాల, చేదుర్తిపాడు, పుట్టగుంట గ్రామాలను సందర్శించి అక్కడ ఉన్న ప్రజానీకాన్ని పునరావాస కేంద్రాలకు తరలించారా లేదా అని అలాగే పునరావాస కేంద్రాలలో ఉన్న బాధితులకు ఆహార సదుపాయాలు, నీటి సదుపాయం, హాస్పిటల్ సౌకర్యాలు అందుతున్నాయా లేదా.. అని రెవెన్యూ, మెడికల్, మున్సి పల్ సిబ్బందిని అడిగి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న గౌరవ ఛైర్మన్ మరియు పదకొండవ అదనపు జిల్లా న్యాయమూర్తి, మరియు న్యాయ సేవాధికార కమిటి శ్రీ జి. సుబ్రహ్మణ్యం గారు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీ బి. లక్ష్మి నారాయణ గారు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎం. సుధారాణి గారు, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి పి. గాయత్రి గారు, అలాగే ఈ కార్యక్రమంలో పానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.









# బంగాళాఖాతంలో వాయుగుండం ఉత్తర కోస్తాలో వర్షాలు



**విశాఖపట్నం సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఒడిశా-బంగాల్ తీరాన్ని ఆనుకుని ఇది ఏర్పడింది. క్రమంగా వాయవ్యదిశగా కదులుతోంది. రాబోయే 24 గంటల్లో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావంతో ఆది, సోమవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పలు చోట్ల చెరువుల్లోకి భారీగా వరదనీరు చేరుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీరం వెంట బలమైన ఈదురు గాలులు వీస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి కేవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఏలూరు, అల్లూరి, ఉభయ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు.. మరికొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# తెలుగు రాష్ట్రాలలో వర్షాలు తగ్గి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

## – గణనాథునికి రవీందర్ యాదవ్ వినతి



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 7 (వార్తాప్రభ):**తెలుగు రాష్ట్రాల్లో వరదలు తగ్గి,ప్రజలు అంత సుఖ సంతోషాలతో జీవించాలని గణనాథుడిని వేడుకున్నట్లు భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ అన్నారు.వరదలు తగ్గి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సీడ్ గణేష్ ప్రతిమలను భక్తులకు అందజేశారు. అలాగే చందానగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ పాలవెల్లిని, మియాపూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ దుర్గా రామ లింగప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు వారికి సీడ్ గణపతి ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ వినాయక చవితి అంటే హైదరాబాద్ వాసులకు ఓ పెద్ద పండుగ వంటిదన్నారు. భక్తి శ్రద్ధలతో నవరాత్రులు పూజలు చేస్తారన్నారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రగతిలో మరింత ముందుకు సాగేలా చూడాలని ఆ గణనాథుడిని వేడుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. రానున్న రోజుల్లో భారాస పార్టీ మరింత బలపడనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు.




# కవులూరు లో 80 మందికి ఉచిత వైద్య పరీక్షలు



**జి.కొండూరు: సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని కవులూరు గ్రామంలో ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జువ్వ వెంకటేశ్వరరావు(జెవిఆర్) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో కవులూరు,ఇతర గ్రామాల నుంచి వచ్చిన 80 మంది కి షుగర్,బిపి,ఇతర సాధారణ వ్యాధులకు సంబంధించి నిపుణులైన వైద్యులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధి గ్రస్తులకు ట్రస్టు ద్వారా నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతినెల రెండవ ఆదివారం ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని జెవిఆర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యు.ఉమేష్ బాబు, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

# 8వ రోజూ ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

## జక్కంపూడి కాలనీలో ఇళ్ల వద్దకు వెళ్లి బాధితులతో మాట్లాడిన సిఎం

**అమరావతి :సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 8వ రోజు కూడా పర్యటించారు. విజయవాడ కలెక్టర్ కార్యాలయం నుంచి బయలు దేరిన సిఎం ముందుగా ప్రకాశం బ్యారేజ్ వద్దకు వెళ్లారు. పడవలు ఢీ కొనడం వల్ల దెబ్బతిన్న బ్యారేజ్ కు జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు, నిపుణులతో మాట్లాడి కౌంటర్ వెయిట్ ఏర్పాటు గురించి తెలుసుకున్నారు. అనంతరం కుమ్మరిపాలెం జంక్షన్, సితార సర్కిల్, చిట్టినగర్,





మిల్క్ ప్రాజెక్టు మీదుగా జక్కంపూడి వెళ్లారు. ఆయా ప్రాంతాలలో జరుగుతున్న పారిశుధ్య పనులను చంద్రబాబు పరిశీలించారు. కుమ్మలరిపాలెం సెంటర్ లో ఫైర్ ఇంజన్ల ద్వారా రోడ్లు క్లీన్ చేయడాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి జక్కంపూడి కాలనీకి వెళ్లారు. జక్కంపూడి కాలనీ లోపలికి కారులో వెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రొక్లెయినర్ ఎక్కి కాలనీలో పర్యటించారు. ఈ ప్రాంతంలో ఇప్పటికీ మోకాలు లోతు నీళ్లు ఉన్నాయి. ప్రొక్లెయినర్ మీదనే ఇళ్ల వద్దకు వెళ్లిన సిఎం బాధిత ప్రజలతో మాట్లాడారు. వారి బాధలు విని ధైర్యం చెప్పారు. ఆహారం అందుతున్న విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మహిళలు తమ సమస్యలు చెప్పుకున్నారు. తాము సర్వం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. బీమా క్లెయిమ్స్ త్వరగా పూర్తి అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చిట్టినగర్ సెంటర్, పైపుల రోడ్డు, బిఆర్టిఎస్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ కు చేరుకున్నారు. అనంతరం అధికారులతో రివ్యూ చేసి...తన దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులతో చర్చించారు.

# డాక్టర్ స్పర్జన్ రాజు సేవలు చిరస్మరణీయం



**కాకినాడ, సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ స్పర్జన్ రాజు సంస్మరణ సభ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైఎంసీఏ అధ్యక్షుడు పిఎం. హెన్రీ అధ్యక్షతన, కార్యదర్శి పిజెవికె .గాంధీ పర్యావేక్షణలో రామారావు పేటలోని సిటీ టెబెర్నకల్ లో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్పర్జన్ రాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిత్య యూనివర్సిటీ ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి హాజరై స్పర్జన్ రాజు ఆదిత్య విద్య సంస్థల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎంతో గొప్పది అన్నారు. స్పర్జన్ మంచి క్రమశిక్షణ కలిగిన వ్యక్తిని తనకు మంచి మిత్రుడు రంగరాయ కళాశాలలోని పీడీగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది యువతకు మంచి స్పూర్తిగా క్రీడలలో నిలిచారని స్పర్జన్ రాజుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆనంతరం ముఖ్య వక్తగా విచ్చేసిన ఆంధ్రా యూనివర్సిటీ పూర్వపు రిజిస్టర్ డా. జేమ్స్ స్టీఫెన్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ దేవుడు యువతకు ఇచ్చిన సామర్థ్యాన్ని సరైన రీతిలో వినియోగించు కోవావని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్పర్జన్ రాజు జ్ఞాపకార్థం నిర్వహించిన షటిల్ , బ్యాడ్మింటన్ పోటీలలో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అతిథులుగా చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ రీజనల్ ఛైర్మన్ డాక్టర్. రోనాల్డ్ విలియమ్స్,డాక్టర్ .స్పర్జన్ రాజు సతీమణి విజయలక్ష్మి,కుటుంబ సభ్యులు,వైఎంసీఏ బోర్డు సభ్యులు ఎస్తేరు రాణి,ఎంఎపి. విజయ్ కుమార్,చప్పిడి సామ్యూల్ విక్టర్,జి. మోజెస్ జెన్నీ ,మీకా యేసు దాసు, క్రీడాకారులు , యువత పాల్గొన్నారు.

# కమలాపురం ఉరివిలో పోషకాహార మాసోత్సవం



**పెడన సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమగ్ర శిశు అభివృద్ధి పథకం( ఐసిడిఎస్) ఆధ్వర్యంలో కమలాపురం ఉరివి గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలలో పోషకాహార మసోత్సవ కార్యక్రమాలు జరిగాయి. సూపర్ వైసర్ కల్పవల్లి ఈ కార్యక్రమంలో పాల్గొని తల్లిదండ్రులు గర్భిణీలు బాలింతలకు పోషకాహార విలువల గురించి తెలియజేశారు. మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల ప్రతి ఒక్కరి ఆరోగ్యం మెరుగుపడతాయన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలు అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి నాగలక్ష్మి వాణి అనురాధ రంగనాయకమ్మ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నందిగామ సచివాలయానికి మోక్షం ఎప్పుడు..??



**పెడన, సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పెడన మండలం నందిగామ సచివాలయం నిర్మాణం చివరి దశలో నిలిచిపోయింది. దీని నిర్మాణం కోసం గత ప్రభుత్వం 80 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఈ నిధులతో సచివాలయం తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రైతు భరోసా కేంద్రం నిర్వహించవలసి ఉంది. గత శాసనసభ్యుడు ఈ పనిని నిర్వహించేందుకు నామినేషన్ పద్ధతి మీద కాంట్రాక్టర్కు కేటాయించారు. పని దాదాపు పూర్తయినప్పటికీ బిల్లులు పెండింగ్ నిర్మాణం వల్ల మిగిలిన పని నిలిచిపోయినట్లుగా సమాచారం. గత సంవత్సర కాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిన పని నిలిచిపోయింది. కాంట్రాక్టర్ కు రావలసిన బిల్లు ప్రాసెస్ లో ఉన్నట్లు సమాచారం. అధికారులు బిల్లులు మంజూరు చేసి మిగిలిన పని కూడా పూర్తయ్యే విధంగా చూడాలని గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు కోరుతున్నారు. శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కూడా ఈ విషయమై దృష్టి కేంద్రీకరించి సచివాలయం నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేవిధంగా చూడాలని ఉపసర్పంచ్ కోరారు.

# వరద బాధితులకు అండగా ముగతి గ్రామ ప్రజలు



**నందవరం, సెప్టెంబర్ 08 వార్త ప్రభ** వరద బాధితులను ఆదుకునేందుకు కర్నూలు జిల్లా నందవరం మండలం ముగతి గ్రామ ప్రజలు వరద బాధితులకు తమ వంతు బాధ్యతగా ముందుకొచ్చారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు బుడుమేరు, విజయవాడ గుంటూరు ప్రాంతంలో వరద ముంపుతో ప్రజలు ఇబ్బందులు పడడం తమను తీవ్రంగా కలిసి వేసిందని అందుకే మా గ్రామ ప్రజలు సహకారంతో ఆర్థిక సహాయానికి ముందుకు వచ్చామన్నారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్ టిడిపి గ్రామ అధ్యక్షులు భార్గవ్ యాదవ్ ఆధ్వర్యంలో 80 వేల రూపాయలు నగదు 50 క్వింటాల బియ్యం గ్రామస్తులు అందజేశారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి వరద బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలరాజు ఉపసర్పంచ్ తాయన్న, మాజీ ఎల్ ఎల్ సి డిసి ప్రెసిడెంట్ కొండారెడ్డి, అక్బర్ బాషా, చింతకాయలు గోవిందు, శీను, ఎస్బిఐ బిసి పాయింట్ హాజీ మల్లన్ బాబు, బోయ గోపాల్, గుగ్గిరి నరసింహులు, నరసన్న, కడబూరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి- సీఐ భీమా నాయక్



**కనిగిరి సెప్టెంబర్ 8 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్ ఆదివారం సూచించారు. స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో మండపాల నిర్వాహకులతో మాట్లాడుతూ కరెంట్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, కాటన్ పరదాలు సులభంగా కాలిపోతాయి కాబట్టి గమనిస్తూ ఉండాలని, కొందరు మెయిన్ లైన్ నుంచి తప్పుడు మార్గంలో కరెంటు తీసుకుంటారు. అది ఎప్పటికీ ప్రమాదమని గుర్తించాలన్నారు. భారీ శబ్దంతో డీజే లు పెట్టుకుని డాన్స్ చేస్తే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఎటువంటి ఇబ్బందికరమైన చర్యలను తీసుకోకుండా ఆనందంగా జరుపుకోవాలని సీఐ భీమా నాయక్ తెలిపారు.

# తిరుమలలో గుండెపోటుతో భక్తురాలి మృతి

**తిరుమల: సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుమలలో గుండెపోటుతో భక్తురాలు మృతి చెందింది. శనివారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లో ఈ ఘటన చోటు చేసుకుంది. సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్తుండగా ఒక్కసారిగా ఆమె కుప్పకూలింది. వెంటనే తోటి భక్తులు, డిస్పెన్సరీ నర్సులు సీపీఆర్ చేశారు. ఈక్రమంలో ఆమెను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేలోపు మహిళ ప్రాణాలు కోల్పోయింది. మృతురాలిని లండన్‌లో స్థిరపడిన కడప జిల్లా వాసి ఝాన్సీ(32)గా గుర్తించారు. ఆమెకు కవల పిల్లలున్నారు. ఝాన్సీ మృతదేహాన్ని రుయా ఆసుపత్రికి తరలించారు. రెండు మెట్ల మార్గాలు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌ల్లో డాక్టర్‌తో కూడిన అత్యవసర వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నతాధికారులున్నారు.

# స్పందించిన హృదయం.. కోటి రూపాయల విరాళం

## అందించిన బొమ్ములూరు దీపక్ నెక్స్ జెన్



**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 8(వార్తాప్రభ)**ఇటీవల వచ్చిన వర్షాలు వరదల కారణంగా మన రాష్ట్రంలో సంభవించిన తీవ్రనష్టంతో పాటు లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. బొమ్ములూరు దీపక్ నెక్స్ జెన్ ఫీడ్ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి సుబ్రమణ్యం మనస్తాపం చెందారు. వారిని ఆదుకునేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు ఇవ్వటంతో స్పందించిన నెక్స్ జెన్ ఎం డి అడుసుమిల్లి వెంకట సుబ్రమణ్యం , ఆయన కుమారుడు నెక్స్ జెన్ డైరెక్టర్ అడుసుమిల్లి చైతన్యవాసు శనివారం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ను కలసి విధి నిర్వహణలో ఉన్న పౌరులుగా మేము సహాయక చర్యల్లో పాల్గొన్నామని మరియు 1,00,00,000/- ఒక కోటి రూపాయల చెక్ ను ఆంధ్ర ప్రదేశ్ విపత్తు నిర్వహణ నిధికి అందించారు. మా ప్రాంతాల్లోని బాధిత ప్రజల ను ఆదుకోవటానికి కృషి చేస్తున్నామని ముఖ్య మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు ఎం డి అడుసుమిల్లి సుబ్రమణ్యం, చైతన్యవాసు లను అభినందించారు.

# నేడు తునిలో పవన్ కళ్యాణ్ సొంత నిధుల చెక్కుల పంపిణీ




**కాకినాడ, సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వరదలకు నష్టపోయిన పంచాయితీలకు జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తన సొంత నిధులను పంచాయితీకి రూ.1లక్ష ప్రకటించిన సంగతి తెలిసినదే. సుమారు రాష్ట్రంలో 400 పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి లక్ష రూపాయలు చొప్పున నాలుగు కోట్లను సోమవారం రాష్ట్రంలోని 20 కేంద్రాల్లో ఆయా పంచాయతీలకు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు)లు తెలిపారు. ఈ సందర్భంగా వారు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)మీడియాతో మాట్లాడుతూ జనసేనాని పవన్ తన సొంత నిధులను పంచాయతీకి లక్ష రూపాయలు చొప్పున కాకినాడ జిల్లాలో ఏడు పంచాయతీలకు రూ.1లక్ష చొప్పున 7చెక్కులను సోమవారం తునిలో నిర్వహించబోయే కార్యక్రమంలో ఇవ్వనున్నట్లు చెప్పారు. కాకినాడ జిల్లాలో ఏడు పంచాయతీలు తుని నియోజకవర్గంలోని నష్టపోయినని తాము గుర్తించామని వాటికి ఆ చెక్కులను అందించిన కొద్దిసేపటికి పంచాయతీల్లో ఆ నగదు జమవుతుందని చెప్పారు. రూరల్ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు(నానాజీ)మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వరద సమీక్ష చేస్తున్నప్పుడు పంచాయతీల పరిస్థితి చాలా దయనీయమైన స్థితిలో ఉందని తెలియడంతో ఆయన తన సొంత నిధుల నుంచి లక్ష రూపాయలు అందిస్తున్నారని చెప్పారు. గత అరాచక వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని దాన్ని తిరిగి అభివృద్ధి బాటలో పయనించడానికి పవన్ దృష్టిలో పెట్టుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం చెక్కులు అందించే కార్యక్రమం 20 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని దీనికి కూటమికి చెందిన ప్రజా ప్రతినిధులను,నాయకులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసైనికుడు, సీనియర్ జర్నలిస్టు చినబాబు,నల్లం శ్రీనివాస్,పాండ్రంకి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రసాయనాలు వినియోగించకుండా మంచి ఆహారం అందించాలి



**కాకినాడ, సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రుచి కోసం అనారోగ్య కారకాలైప రసాయనాలు వినియోగించకుండా శుచితో కూడిన మంచి రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) సూచించారు. ఆదివారం కాకినాడ 50 బిల్డింగ్ సెంటర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీమధురం వెజిటేరియన్ రెస్టారెంటును ఎమ్మెల్యే నానాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ కాకినాడ నగరంలో వ్యాపారంగంలో పోటీ బాగా నెలకొందని ఆ పోటీలో నిలదొక్కుకోవాలంటే ఎటువంటి రంగులు కలపని పదార్థాలు విక్రయించి పేరు తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. దీనివల్ల ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవడంతో పాటు అనారోగ్యాలు బారిన పడుతున్నారన్నారు. ప్రజారోగ్యం కాపాడటంలో ఆహార పదార్థాలలో నాణ్యత ప్రమాణాలు కూడా ఒకటన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, తెలుగు దేశం పార్టీ నాయకులు కటకం శెట్టి వెంకట ప్రభాకర్ (బాబి) సురేష్ , జనసైనికుడు సీనియర్ జర్నలిస్టు చినబాబు,పాండ్రంకి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతియే మహాగణపతి.

## ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు...



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 8: (వార్తాప్రభ)** : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రారంభమైన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎమ్మెల్యే పిలుపు మేరకు కార్యాలయ సిబ్బంది మట్టి గణపయ్యను ప్రతిష్టించారు. అనంతరం "విఘ్నాధిపతి అయిన వినాయకుడి"కి కార్యాలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ మట్టి గణపతిని ప్రతిష్టించినట్లు తెలిపారు.

# ఆపదకాలంలో చిన్న సహకారం కూడా చాలా గొప్పది

– హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంక బత్తుల వెంకట్

**గన్నవరం, సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆపదకాలంలో చిన్న సహకారం కూడా చాలా చాలా గొప్పదని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం పాయకపురంలో విపత్తు వలన ఇబ్బందులు పడుతున్న వరద బాధితులకు గన్నవరం మండలం దావాజిగూడెం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు హెల్పింగ్



హ్యాండ్స్ సొసైటీ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ మరియు హనుమాన్ జంక్షన్ సూర్య మెడికల్ స్టోర్ అధినేత కమ్మిలి సూర్యనారాయణ మూర్తి, అడపా బాలరవి కిరణ్ సంయుక్త సహకారంతో బిర్యానీ,మందులు బిస్కట్లు,కాండిల్స్,దోమల పుల్లలు పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ మా సంస్థ ఆధ్వర్యంలో గత వారం రోజులు నుండి విపత్తు కష్టకాలంలో ఉన్న ప్రజలకు,వాటర్ బాటిల్స్, భోజనాలు,మందులు,సరుకులు,బిస్కట్స్ పంపిణీ చేస్తూ చేయూత అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ క్లిష్టమైన పరిస్థితులలో ప్రజలు ఆత్మస్థైర్యం,ధైర్యంతో ఉండాలని,ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వెంకట్ తెలిపారు. హనుమాన్ జంక్షన్ చెందిన సూర్య మెడికల్ ఫ్యాన్సీ స్టోర్స్ అధినేత కమ్మలి వీర వెంకట సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ విపత్తు లో ప్రజలు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని వారికి సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ సహకారాలు అందించాలని ఆయన అన్నారు. ఈ విపత్తు లో బాధితులకు ప్రభుత్వంతో పాటుగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ వంటి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవాకార్యక్రమాలు చాలా గొప్పవని సూర్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ కి సూర్య మెడికల్ స్టోర్ వారికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. విజినిగిరి జ్ఞానేశ్వర రావు,మాయరా వెంకయ్య స్వామిదారావత్ వెంకన్న పాల్గొన్నారు.

# గండ్లు పూడ్చివేత పూర్తి

– భారీ వర్షంలో సైతం కొనసాగిన పనులు

పర్యవేక్షించిన మంత్రి నిమ్మల రామానాయుడు

ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్





**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 08(వార్తా ప్రభ ప్రతినిధి):–** కొండపల్లి శాంతినగర్ వద్ద బుడమేరు డైవర్షన్ ఛానల్ మూడో గండి పూడ్చివేత పూర్తయింది. ఏకధాటిగా భారీ వర్షం కురుస్తున్నా పనులు ఆపకుండా పూర్తి చేశారు. మూడో గండి పడిన ప్రదేశం అవతలి కట్ట వరకు బండరాళ్లతో మార్గం ఏర్పాటు చేసి పూర్తి చేశారు. దీంతో రాళ్ల కింద నుంచి కొద్దిగా ప్రవాహం వెళ్తున్నప్పటికీ భారీ స్థాయి ప్రవాహాన్ని నియంత్రించ గలిగారు. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ భారీ వర్షంలో తడుస్తూనే పనులను పర్యవేక్షించారు. గత ఐదు రోజుల నుంచి రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరాయంగా గండ్లు పూడ్చివేత పనులు కొనసాగాయి. శుక్రవారం రెండు గండ్లు పూడ్చివేత పూర్తి చేసి మూడో గండి పూడ్చివేత పనులను ప్రారంభించారు. శనివారం సాయంత్రానికి మూడో గండి పూడ్చివేత పనులు పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ మధ్యాహ్నమే పూర్తి చేయగలిగారు. ఇక బుడమేరు కట్ట ఎత్తు పెంచే పనులు, కుడి కట్టపై పడిన గండ్లు పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయి. మూడు భారీ గండ్లు పూడ్చివేత పనులు పూర్తి చేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# ఓపెన్ స్కూల్ ద్వారా అక్షరాస్యతను మెరుగు పరుచుకోండి

## – విద్యా వేత్త రాధాకృష్ణమూర్తి



**పెదన సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ–పెదన శాఖ ఆధ్వర్యములో.... శివార్జున స్టడీ సెంటర్ ఫర్ సైన్సెస్ రాధ కృష్ణా భవన్ గూడూరు రోడ్ పెదన ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించబదినది అక్షరాస్యతను మెరుగు పరచడంలో విశేష కృషి చేస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (అపొస్ ) పెదన భట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కో ఆర్డినేటర్ ప్రధానోపాధ్యాయురాలు బూసం తీర్ధవతి కన్వీనర్ అద్దంకి అశోక్ కుమార్ ఘనముగా సన్మానించారుఈ సందర్భముగా రిటైర్డ్ డి.వి.ఈ.వో మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ పెదన శాఖ అధ్యక్షులు మట్టా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూభారత దేశంలో అందరికీ విద్యను అందించి అక్షరాస్యతను మెరుగు పరుచుటలో భాగముగా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (నియస్ ) ఆధ్వర్యములో ఆయా రాష్ట్రాల్లో ఓపెన్ స్కూల్స్ ఓపెన్ యూనివర్సిటీలు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగములు ఆన్లైన్ కోర్సులు,గ్రంథాలయములు, విద్యా సంస్థలు ....విశేష కృషి చేస్తున్నాయి అన్నారు. అందరికీ విద్య అందించాలనే ఉద్దేశముతో నియత విద్యా విధానం కు సమాంతరంగా అనియత విద్యా విధానం(దూర విద్య విధానం) ద్వారా కే జి నుండి పి జీ వరకు చదువు కోవడమే కాక పరిశోధనలు సైతం చేయవచ్చు అని అన్నారు. అపొస్ ద్వారా టెన్త్ ఇంటర్ లను అంబేద్కర్, ఇగ్నో ఆచార్య నాగార్జున ఆంధ్ర ఉస్మానియా వెంకటేశ్వర కాకతీయ,పొట్టి శ్రీరాములు...లాంటి విశ్వ విద్యా లయాల దూర విద్య విభాగములు ద్వారా డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్,రీసెర్చ్ చేయ వచ్చునని అన్నారుఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (అపొస్ ) భట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ,మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ పెదన శాఖ కోశాధికారి కాగిత శంకర సాంబ శివరావు మాట్లాడుతూ...దూర విద్య విభాగములను ప్రధాన విద్యా శాఖ నుండి వయోజన విద్య విభాగంలోకి తీసుకువచ్చి నిర్వహించడం ద్వారా ఆశించిన ఫలితాలు పొందవచ్చు అన్నారు. పాఠశాలలో కళాశాలలో దూర విద్యా విభాగంలలో పనిచేయటానికి శాశ్వత ఉద్యోగులు లేకపోవటం వల్ల పాఠశాలల్లో కళాశాలలో ఉపాధ్యాయులను లెక్చరర్లను ఉపయోగించుకోవటం జరుతుంది. నియత విద్యా విధానములో విద్య నభ్యసించే వారు బోధనాసిబ్బంది కొరతతో ఇబ్బంది పడుచున్నారు. వయోజన విద్య విభాగము కి దూర విద్య విభాగమును అందించి శాశ్వత ఉద్యోగులను ఏర్పాటు చేయుట ద్వారా లక్ష్యాలను సులభముగా అందుకోవచ్చు అని అన్నారు భట్ట్జన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూసం తీర్ధవతి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఏపీ ఓ ఎస్ ఎస్ ద్వారా దూర విద్యా విధానం లో పదవ తరగతి ఇంటర్ చదవడానికి ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుచున్నవి అని అవకాశము సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ, ఎక్స్ సర్వీస్ మెన్ మహిళా దివ్యంగా విద్యార్థులకు అడ్మిషన్ ఫీజులలో రాయితీ కల్పించడం జరుగుతుంది అన్నారు. భట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏపీ ఓ ఎస్ ఎస్ దూర విద్యా కేంద్రం కన్వీనర్ అద్దంకి అశోక్ కుమార్ మాట్లాడుతూ దూర విద్య ద్వారా మన స్కూల్ లో ఉన్న దూర విద్య కేంద్రము ద్వారా పదవ తరగతి మాత్రమే కాక ఇంటర్ ఒకే ఒక్క సం లో పూర్తి చేయ వచ్చునని అన్నారు. రెగ్యులర్ గా చదివే టెన్త్,ఇంటర్ లకు ఇది సర్వ సమానం అని అన్నారుమానవతసభ్యులు,ఉపాధ్యాయులు అబ్దుల్ కుర్షిద్ బేగం బెల్లంకొండ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు వలవల సాయం

**కృత్తివెన్ను సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన విజయవాడ వరద



బాధితుల సహాయార్థం నిమిత్తం తమ వంతు సాయంగా కోమాళ్ళ పూడి వాస్తవ్యులు,కృత్తివెన్ను మాజీ ఎంపీపీ వలవల సత్యనారాయణ కుమారులు తాతాజీ మరియు ప్రతాప్ లు సంయుక్తంగా 15,000 రూపాయలన నగదును పెదన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కు అందజేశారు. మానవతా దృక్పథంతో తమ వంతు సాయంగా 15,000 రూపాయలను అందించిన కృత్తివెన్ను మాజీ ఎంపీపీ ఉలవల సత్యనారాయణ తనయులు అయిన తాతాజీ మరియు ప్రతాప్ లను పెదన ఎమ్మెల్యే కాగిత అభినందించారు.

# వైసీపీ హయాంలో కాకినాడను భూకబ్జాల నగరంగా మార్చేసారు – ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ, సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కాకినాడ నగరం ఒకప్పుడు పెన్షన్ ప్యారడైజ్ అనేవారని గత వైసీపీ అరాచక ప్రభుత్వంలో అది భూకబ్జాల నగరంగా మారిపోయిందని దాన్ని పోగొట్టేందుకు కాకినాడ నగరంనకు ఇరువైపుల పెన్షనర్ ప్యారడైజ్ అనే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) సూచించారు. ఆదివారం కాకినాడ రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని రైల్వే పింఛనుదారుల సంక్షేమ సంఘం సమావేశమునకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ కాకినాడ నగరం గత అరాచక వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు నిలయంగా మారిపోయిందని దాన్ని తొలగించేందుకు నగరానికి అన్ని వైపులా పింఛనుదారుల స్వర్గలోకం అనే అర్థం వచ్చే విధంగా పెన్షనర్ పారడైజ్ అనే బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. కాకినాడ నగరం ఎల్లప్పుడు ప్రశాంతతకు మారుపేరని గత ఐదేళ్లలో ఆ పేరును అక్రమాలు చేసి వైసీపీ వారు చెడగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ పరిధిలో ఎక్కడో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకొని ఉందామని అనుకునేవారు ఎంతోమంది ఉండేవారని తిరిగి అదే విధానం తమ ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో కొనసాగుతుందని పింఛనుదారులకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం నానాజీని రైల్వే పింఛనుదారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వివిఎస్.మూర్తి, కార్యదర్శి బివి.రమణ,కార్యదర్శి టి. రఘురాం, కో–ఆర్డినేటర్ కెవి రామారావు,జాయింట్ సెక్రటరీ జిలాని భాషా,ముఖ్య సలహాదారుడు ఎన్.వి. రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యవసర సరుకులు అధిక ధరలకు విక్రయిస్తే కేసు నమోదు చేస్తాం

వరద ముంపు ప్రాంతంలో ప్రతి కుటుంబానికి సరుకులు అందేలా చర్యలు

పౌరసరఫల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 08(వార్తా ప్రభ ప్రతినిధి):–** గుంటుపల్లి గ్రామ ఆర్.సి.యం చర్చిలో, తుమ్మలపాలెం మరియు ఇబ్రహీంపట్నం ఫెర్రీలో ప్రభుత్వ ద్వారా అందించే నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి ప్రారంభించారు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కష్టకాలంలో అందరూ నిజాయితీతో బాధ్యతగా పనిచేయాలని కోరారు. ముంపు ప్రాంతాలలో ప్రతి కుటుంబానికి సరుకులు అందే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఎవరు ఇబ్బంది పడవలసిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికి సరుకులు అందజేస్తామని తెలిపారు. నిత్యవసర సరుకులను వ్యాపారస్తులు ఎంఆర్పి రేటుకు మించి అమ్మితే కేసులో నమోదు చేస్తామని తెలిపారు. ఇప్పటికే విజయవాడ పరిధిలో లీగల్ టీం ద్వారా దాడులు నిర్వహిస్తున్నామని, ఇబ్రహీంపట్నంలో కూడా టీం చర్యలు తీసుకుంటుందని మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నకు సమాధానం గా చెప్పారు. ఇది కష్ట కాలమని ఈ సమయంలో అందరూ నిజాయితీగా పనిచేయాలని, బాధితులకు మరింత ఇబ్బంది పదేవిధంగా వ్యవహరించడం తగదని హెచ్చరించారు. జనసైనికులు అందరూ బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వాడ వాడలా తొలి పూజ అందుకున్న గణేష్ మహారాజ్

వరద బాధితులను కాపాడలని ప్రార్ధనలు చేసినకూటమి నాయకులు

**నందిగామ సెప్టెంబర్ 8 (వార్త ప్రభ):**–పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి నాయకులు శ్రీ వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ట చేసి చవితి తొలి పూజలు నిర్వహించారు. గత వారం రోజుల నుండి తీవ్ర వర్షాభావన్ని ఎదుర్కొంటున్నప్పటికీని పట్టణంలో ప్రతి సంవత్సరం లాగానే చవితి పందిళ్లు వెలిశాయి. శనివారం జోరున వారం కురుస్తున్నప్పటికి వాసవి మార్కెట్,గాంధీ సెంటర్, స్టేట్ బ్యాంక్ ఎదురుగా, రైతుపేట గీతా మందిరం వద్ద,పాత బస్టాండ్ మార్కెట్ యార్డ్ వద్ద, అదేవిధంగా పట్టణంలో పలు ప్రాంతాలలో వినాయక ఉత్సవ పందిళ్లను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసుకొని తొలి పూజలు గావించారు. ప్రతి పూజలోనూ వరద బాధితులకు మనోధైర్యాన్ని ప్రసాదించి వారికి అండగా నిలవాలని వినాయకుడిని ప్రార్ధనలు చేశారు.

# వరద బాధితులకు దుప్పట్లు పంపిణి



**జి.కొండూరుసెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:మండల కేంద్రమైన జి. కొండూరు గ్రామంలో ఆదివారం స్థానిక ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ తమ సొంత నిధులు వెచ్చించి వరద బాధితులకు దుప్పట్లు,చీరలు పంపిణీ చేశారు. స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ గ్రామములోని వరద ముంపుకు గురైన బుడుగు జంగాలు ఏరియాను సందర్శించి నిరుపేద బాధితులకు దుప్పట్లు,చీరలు అందజే శారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండల అరుణ,మండల కో ఆప్షన్ సభ్యులు హుస్సేన్, గ్రామ పార్టీ అధ్యక్షు లు వేములకొండ విష్ణు,పజ్జూరు తిరుపతిరావు,మందా కాంతయ్య, పజ్జూరు నాగ మల్లేశ్వరరావు, రామస్వామి,రాంభూపాల్ రెడ్డి ,బట్టపర్తి శేఖర్ బాబు, బాజీ ,గోవర్ధన్, అంజి , నాగరాజు,నాని,చందు, నాగబాబు, సాయి,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ప్రత్యేక పూజలు నిర్వహించిన డిప్యూటీ మేయర్



**నిజాంపేట్ సెప్టెంబర్ 8 (వార్తాప్రభ)** : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీ శుభంకరీ దేవస్థానం వారి ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా శనివారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ విచ్చేసి విఘ్నేశ్వరుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియచేసారు.




పాన్ ఇండియా ఐకానిక్ అవార్డ్స్ –2024 పి.టి.ఎల్.ఎఫ్.కార్యక్రమాన్ని 8 సెప్టెంబర్ 2024న కెనడి నెక్స్ట్ జెన్ స్కూల్ గుంటూరులో నిర్వహించింది. 2024 ఉత్తమ ఉపాధ్యాయుడిగా నూజివీడు కు చెందిన కొణతం విజయ్ బాబు యాదవ్ అవార్డు అందుకుంటున్న చిత్రం **వార్తా ప్రభ, నూజివీడు**

# వరద బాధితులకు రెండోసారి ఆపన్న హస్తం అందించిన కాకతీయ



**నందిగామ సెప్టెంబరు 8 (వార్తా ప్రభ):**– కాకతీయ – అపోలో విద్యాసంస్థల డైరెక్టర్ కాపా కార్తికేయ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు ముంపునకు గురైన సింగ్ నగర్ లోని వరద బాధితుల ఇంటింటికి వెళ్లి రెండవసారి బియ్యం,వాటర్ బాటిల్స్,చట్నీ పాకెట్స్, పప్పులను పంపిణీ చేశారు. ఆదివారం విజయవాడ సింగ్ నగర్ ముంపు ప్రాంతంలో కాకతీయ అపోలో విద్యాసంస్థలు చేపట్టిన సహాయక చర్యలలో భాగస్తులైన సంస్థ ప్రతినిధులకు మరియు విద్యార్థుల తల్లిదండ్రులకు కాకతీయ చైర్మన్ కాపా రవీంద్రనాథ్ అభినందించారు. వరద బాధితులకు తమ వంతు సహకారాన్ని అందించేటందుకు సహకరించిన సిపిఎం నాయకులు బాబురావు,దేవి కృష్ణ,గోపాల్, గోపి నాయక్ నాయక్ లకు రవీంద్రనాథ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## 28 నిల్వ కేంద్రాలలో అందుబాటులో ఉన్న ఇసుక 14,22,664 మెట్రిక్ టన్నులు

**–రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా**



**అమరావతి,సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పలు చోట్ల రహదారులు దెబ్బతిన్న పరిస్థితిలో ఇసుక రవాణా పరంగా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వినియోగదారులు తమవంతు సహకారం అందించాలని వాణిజ్య పన్నుల శాఖ ఛీఫ్ కమీషనర్, గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపధ్యంలో ఇసుక నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయని, వర్షాకాలం ముగిసిన తురువాత ఇసుక నిల్వలకు కొరత ఉండబోదన్నారు. వివిధ రీచ్ ల నుండి సరఫరా నిలిచిపోయిందని, వర్షాలు తగ్గి, రవాణా పరిస్థితులు మెరుగైన తురువాత పూర్తి స్థాయిలో ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. సోమవారం ఉదయానికి 28 ఇసుక నిల్వ కేంద్రాలలో 14,22,664 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. 1735 మెట్రిక్ టన్నుల ఇసుక కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం 177 మంది ధరఖాస్తు చేసుకోగా, వారితో పాటు పెండింగ్ లో ఉన్న 151 ధరఖాస్తుదారులకు 2122 మెట్రిక్ టన్నుల ఇసుక, మొత్తంగా 328 మంది ధరఖాస్తుదారులకు 3857 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసామని మీనా వివరించారు.

# కోతకి గురవుతున్న కృష్ణవేణమ్మ పాదాలు..!

**కోడూరు, సెప్టెంబర్ 8( వార్త ప్రభ) :**గత కొద్దిరోజులుగా వస్తున్న వరద



ప్రభావానికి హంసలదీవి పవిత్ర సాగర సంగమ ప్రదేశం వద్ద ఉన్న కృష్ణవేణమ్మ పాదాలు కోతకు గురవుతున్నాయి.కృష్ణవేణమ్మ పాదుకుల వద్ద నుంచి సుమారు 6 మీటర్ల దూరాన ఉన్న కృష్ణానది కి వరద తీవ్రత అధికంగా ఉండటం తో ఆప్రదేశం అంతా కోతకు గురై కృష్ణవేణమ్మ పాదాల వద్దకు నీరు చేరుతుంది.ఇదే పరిస్థితి కొనసాగితే మరి కొన్ని రోజుల్లో కృష్ణవేణమ్మ విగ్రహంతో సహా కృష్ణా నదిలో కలిసిపోయే ప్రమాదం ఉందని భక్తులు వాపోతున్నారు.

## ఆదివారం కూడ కొనసాగిన శ్రీద్వారకా సాయి సేవా సంస్థ వారీ సేవా కార్యక్రమాలు




**గుడివాడ :సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆదివారం శ్రీ ద్వారకా సాయి సేవా సంస్థ గుడివాడ వారిచే నందివాడ నందు, మరియు పరిసర ప్రాంతాలైన వెన్ననపూడి, రామాపురం, తుమ్మలపల్లి, అరిపిరాల తదితర ప్రాంతాలలో ఎంతోమందికి రొట్టెలు బిస్కెట్లు రాస్కులు అరటిపళ్ళు ఇతర ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులైన శ్రీ మోర్ల లీల ప్రసాద్ కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, సుధీర్, గీతిక, సాహితీ లు స్పందించి పెద్ద ఎత్తున వితరణ చేసి ఆర్తులను ఆదుకోవడం జరిగింది. ఇదే రీతిగా సంఘ సభ్యులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్ సీతారామస్వామి, వైస్ ప్రెసిడెంట్ మరీదు శ్రీనివాసరావు, సెక్రెటరీ నారాయణమూర్తి భాగవతల ఉమామహేశ్వరి, కోశాధికారి లక్ష్మి వెంకటలక్ష్మి, అంజలి, అరుణ, పాండు, దుర్గారావు, నాగబాబు తదితరులు కార్యక్రమం జయప్రదం చేశారు.

## 2వ రోజు శ్రీ మహా గణపతిగా స్వామి వారి దర్శనం



**గుడివాడ :సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి వారీ దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాల భాగంగా రెండో రోజు (ఆదివారం) శ్రీ మహా గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో ప్రసాద్, దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ సాయిన రాజేష్, సభ్యులు శలంకాయల లీలాకుమారి, లోయ వాసు, వికృతి పోతురాజు, పంచమర్తి శ్రీనివాసరావు, ఎరికిపాటి సుశీల, వీరమాచినేని శైలజ తదితరులు పాల్గొన్నారు.

# వడ్లమన్నాడు డ్రైనేజీ.. కౌతవరం పునరావాస కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్..



**గుడివాడ సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**: నియోజకవవర్గ పరిధిలోని గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు డ్రైనేజీని ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, గుడివాడ నియోజకవర్గ శాసన సభ్యులు వెనిగండ్ల రాముతో కలిసి పరిశీలించారు. జిల్లాలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, ముంచెత్తిన వరదలతో పంట కాలువలతో పాటు డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వడ్లమన్నాడు వద్ద డ్రైనేజీని పరిశీలించి రైతులతో మాట్లాడారు. తమ పంట పొలాల్లోని నీరు డ్రైనేజీలోకి వెళ్లకపోగా ఎగదన్నుతోందని, మరోపక్క పంట కాలువలు పొంగి ప్రవహించి పంటచేలల్లోకి చేరి మునకన పడుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్ ని కోరారు. ఈ క్రమంలో వారు పొక్లెయిన్ తో డ్రైనేజీలోని గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులను పరిశీలించి అందుకు సంబంధించిన పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

<u>కౌతవరం పునరావాస కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్..</u>

గుడ్లవల్లేరు మండలంలోని కౌతవరం పునరావాస కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, గుడివాడ నియోజకవర్గ శాసన సభ్యులు వెనిగండ్ల రాముతో కలిసి సందర్శించారు. వారికి అందిస్తున్న భోజనం ఇతర సదుపాయాలను పునరావాస కేంద్రంలోని బాధితుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వారు బాధితులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పునరావాస కేంద్రంలో ఉండకుండా కొంతమంది బయటకు వెళ్ళిపోతున్నారని, శ్రమకోర్చి వారందరినీ తిరిగి సెంటర్కు తీసుకొస్తున్నామని అధికారులు కలెక్టర్కు వివరించారు. మీ సంరక్షణ కోసమే ఇదంతా చేస్తున్నామని, అధికారులతో సహకరించి పరిస్థితులు సాధారణస్థితికి వచ్చేంతవరకు పునరావాస కేంద్రంలోనే సురక్షితంగా ఉండాలని కలెక్టర్, ఎంఎల్ఏ లు బాధితులకు సూచించారు. డ్రైనేజీ శాఖ, రెవెన్యూ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# వరద ముంపు ప్రాంతాల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరీ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పర్యటన..

<u>ప్రత్యేక బోట్ల ద్వారా ముంపు గ్రామాలకు చేరుకున్న నేతలు..</u>

<u>ముంపు గ్రామాల్లో ప్రజలతో మాట్లాడిన మంత్రి రవీంద్ర, ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము లు..</u>



**గుడివాడ : సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కనీవిని ఎరుగని రీతిలో బుడమేరుకు వచ్చిన వరద.. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలను అతలాకుతలం చేసిందని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. గత ఏడు రోజులుగా నీటిలోనే అనేక ప్రాంతాలు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల ఆక్రమణలు ,మట్టి దోపిడీతో.. బలపరచాల్సిన బుడమేరు గట్లను బలహీనపరిచారన్నారు. విపత్తుల వేళ ప్రజల వద్దకు వచ్చి ధైర్యం చెప్పాల్సింది పోయి.. రాజకీయాలు చేయడం సిగ్గుచేటు విమర్శించారు. వరద ప్రభావంలో నష్టపోయిన అందరిని పూర్తి స్థాయిలో ఆదుకుంటాం.. ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాలను సాధారణ స్థితికి తేవడానికి 7రోజులుగా సీఎం విజయవాడలోనే ఉన్నారు. ఈ క్రమంలో కూటమినేతల స్వచ్ఛందంగా ముందుకు వచ్చి.. సేవలు అందించడం అభినందనీయం అన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరీ మాట్లాడుతూ ఎప్పుడులేని దారుణమైన పరిస్థితులను నేడు చూస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కష్టాలు రాకుండా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకుంటారనీ తెలిపారు. కేంద్ర మరియు నాబార్డు నిధులతో బుడమేరు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ క్రమంలో పంట,ఆస్తి నష్టం జరిగినా ప్రతి ఒక్కరికి మెరుగైన నష్టపరిహారం అందిస్తాం అని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మచిలీపట్నం ఇంచార్జ్ ఆర్కే, టిడిపి నాయకులు రాధాకృష్ణ, చాటర్గడ్డ రావి, అందుగుల ఏసుపాదం, యార్లగడ్డ రవి, గుడివాడ ఆర్డీవో పద్మావతి, నందివాడ ఎండిఓ నాగేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ మల్లికా, నందివాడ మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి జనసేన పార్టీ నాయకులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ఎన్టీఆర్ఆఫ్ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులను పరామర్శించిన జిల్లా కలెక్టర్ మరియు ఎస్పి



**కంకిపాడు సెప్టెంబర్ 8 (వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని ఉప్పులూరు గ్రామంలో బుడమేరు నీటి ప్రవాహం వలన నష్టపోయినటువంటి పంట పొలాలను మరియు బుడమేరు నీటి ప్రవాహం వలన ముంపుకు గురైనటువంటి మంతెన ,తెన్నేరు గ్రామాలలో ఇళ్ల యొక్క స్థితిగతులను గురించి అక్కడున్న రైతులను బాధితులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ,కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర్ పరామర్శించి వారి యొక్క సమస్యలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పునరావాస కేంద్రాల్లో



ఉన్నటువంటి బాధితులకు అందుతున్నటువంటి సదుపాయాలను గురించి వారిని అడిగి తెలుసుకొని స్వయంగా ఆహారాన్ని వడ్డించారు. ఈ యొక్క కార్యక్రమంలో ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ ఆర్డీవో రాజు , కంకిపాడు ఎమ్మార్వో మరియు ఎంపీడీవో తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ దేవినేని రాజా గ్రామ నాయకులు కొండవీటి శివయ్య , రైతులు గ్రామస్తులు కూటమి నాయకులు , రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్ని సామాజిక వర్గాలకు న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం.

■ కాంగ్రెస్ నాయకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్.

**కూకట్ పల్లి,సెప్టెంబర్8(వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్రానికి నూతనంగా నియమింపబడ్డ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్ ని ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ నేతృత్వంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ



ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి దినేష్ కుమార్,కెపిహెచ్బి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజు పృథ్వి తదితరులు పాల్గొనడం జరిగింది.

# 11వ తేదీన కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన

<u>కాకినాడ జిల్లా మాల మహానాడు జేఏసీ</u>

<u>9న కచేరీపేట కమ్యూనిటీ హాలులో జెఏసీ సమావేశం</u>




**కాకినాడ సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాజకీయ ప్రేరణతో దళితులని రాజ్యాధికారానికి రానివ్వకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీలను రాష్ట్రాలకు వర్గీకరించుకోవచ్చు అన్ని ఇచ్చిన తీర్పునకు – వ్యతిరేకంగా 2024 సెప్టెంబరు 11వ తేదీన భారత దేశవ్యాప్తంగా ప్రతిఘటన నిరసన ఉద్యమంను విజయవంతం చేద్దాం ప్రతిఘటన ఉద్యమాన్ని బిఎస్పీ అధినేత బెహన్ జి.మాయావతి. భీమ్ ఆర్మీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్,లోక్ జనశక్తి అధినేత చిరాగ్ పాస్వన్, ప్రముఖ సంఘాలు ఇచ్చిన పిలుపు విజయవంతం చేయాలి. కావున ఈనెల 9వ తేదీ సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకి కాకినాడ కచేరి పేట కమ్యూనిటీ హాల్ నందు జేఏసీ సోదరులు సోదరీమణులు అందరూ వచ్చి 11వ తేదీన జరగబోవు కార్యక్రమానికి కార్యాచరణ నిమిత్తం అందరూ రావలసిందిగా కోరుచున్నాము

**ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ** మాల మహానాడు కాకినాడ జిల్లా జేఏసీ అధ్యక్షులు సిద్ధాంతల కొండబాబు, కాకినాడ జిల్లా జేఏసీ గౌర అధ్యక్షులు పండు అశోక్ కుమార్,తోటి చెంగల్ రావు,పిట్టా వరప్రసాద్, అయితా బత్తుల రామేశ్వరరావు, తుమ్మల నూకరాజు, కాకినాడ జిల్లా కన్వీనర్లు ఇన్చార్జిలు బుంగ సతీష్ కుమార్,ఏనుగుపల్లి కృష్ణ,మూలే మేఘరాజు,ఉల్లం రవి, తదితరులు పాల్గొన్నారు

# వరద బాధితులకు కోటి విలువైన సహాయ సామాగ్రి-మంత్రి శ్రీధర్ బాబు



**ఖమ్మం, సెప్టెంబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహబూబాబాద్ జిల్లాల్లోని వరద బాధితులను ఆదుకునేందుకు హైదరాబాద్ సాఫ్ట్ వేర్ కంపెనీల సంఘం (హైసియా), నిర్మాణ డాట్ ఆర్గ్ సంస్థలు కోటి రూపాయల విలువైన సహాయ సామాగ్రిని అందజేస్తుడం పట్ల ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. వెయ్యి సంచుల సహాయ సామాగ్రితో కూడిన తొలి వాహనాన్ని ఆయన ఆదివారం నాడు సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. బియ్యం, వంట నూనె, చక్కెర, ఉప్మారవ్వ, ఉప్పు, కారం, పసుపు, సబ్బులు, టవల్స్, టూత్ పేస్టు, శానిటరీ ప్యాడ్ లతో కూడిన ఒక్కో కిట్ లో రూ.3 వేల విలువైన సామాగ్రి ఉంటుంది. మరో మూడు వాహనాల సామాగ్రిని రెండు రోజుల్లో పంపిచనున్నట్లు శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రభుత్వ సహాయ, పునరాస కార్యక్రమాలకు తోడుగా ప్రైవేటు సంస్థలు, ఎన్జీవోలు ముందుకు వచ్చి వరద బాధితులకు చేయూతనివ్వాలని మంత్రి పిలుపునిచ్చారు. వదరల్లో సర్వం కోల్పోయిన వారి పునరావాసానికి కూడా ఈ సంస్థలు సహాయపడాలని శ్రీధర్ బాబు కోరారు. కార్యక్రమంలో హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నాదెండ్ల, మాజీ అధ్యక్షుడు భరణీ కుమార్, నిర్మాణ, ఐఎస్టీ, తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సేవకు ప్రతిరూపం

<u>ఎన్.ఎస్.ఎం. పబ్లిక్ స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్</u>




**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 8(వార్తాప్రభ)**వరదల కారణంగా నిరాశ్రయులైన బాధితులకు ప్రభుత్వం హనుమాన్ జంక్షన్ జిల్లా పరిషత్ హైస్కూల్, కానుమోలు జిల్లా పరిషత్ హైస్కూల్ లో వరద బాధితుల పునరావాస శిభిరం ఏర్పాటు చేశారు. ఈ శిభిరాల్లో ఉన్న బాధితులకు విజయవాడ ఎన్.ఎస్.ఎం. పబ్లిక్ స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోషియేషన్ నిర్వాహకులు గురుజిత్ సింగ్ , శ్రీకాంత్, ఆశాజ్యోతి డైరెక్టర్ మరీదు మాధవీ లత, లయన్స్ గ్లోబల్ ప్రెసిడెంట్ తాడి రంగారావు పర్యవేక్షణలో పంపిణీ కార్యక్రమం జరిగింది. శనివారం సాయంత్రం మహిళలకు , మగవారికి వేర్వేరుగా దుస్తుల కిట్ లను అందించారు. హనుమాన్ జంక్షన్, కానుమోలు కలిపి 3 లక్షల రూపాయల విలువచేసే దుస్తులను 600 మంది వరద బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు ఎం ఆర్ ఓ వి. నాగభూషణం,బాపులపాడు ఉప సర్పంచ్ దుట్టా శివనారాయణ, మాజీ జెడ్ పి టి సి సుంకర సుభాష్ చంద్రబోస్, కానుమోలు మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ , పుట్టా సురేష్, ముచ్చర్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188